క్లుప్తంగా

ఆలయానికి రూ.10 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.5 వేలు, గోశాలలో గోవుల సంరక్షణకు రూ.5 వేల వంతున విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన గరిమెళ్ల ఆంజనేయ ప్రసాద్ కుటుంబ సభ్యులు శనివారం ఆలయ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

స్కూలు స్థలం అభివృద్ధి



పెనుగంచిప్రోలు: స్థానిక ఎస్ఎస్‌పీఎం బాలికల జెడ్పీ హైస్కూల్ స్థలాన్ని శనివారం డ్రోజర్ సాయంతో అభివృద్ధి చేశారు. స్థలం మొత్తం పిచ్చిమొక్కలు, చెట్లతో అపరిశుభ్రంగా ఉండటంతో హెచ్ఎం నక్కా బాబూరావు తన సొంత డబ్బులు వెచ్చించి స్థలాన్ని అభివృద్ధి చేశారు. పనులను హెచ్ఎం, పీడీ వేగినేటి వెంకటరమణ పర్యవేక్షించారు.

అంబులెన్స్ అందజేత



నందిగామ టౌన్: ఆర్యవైశ్య కుటుంబాల సౌకర్యార్థం ఉచిత అంబులెన్స్ సర్వీస్ ఏర్పాటు చేయటం అభినందనీయమని సీపీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన కపిలవాయి మల్లికార్జునరావు కుమారుడు, ప్రవాసాంధ్రుడు గంగాధర్ తన సొంత నిధులు రూ.నాలుగు లక్షలతో ఆర్యవైశ్య సంఘ నాయకుడు పారుపల్లి సాయిబాబుకు అందజేసిన అంబులెన్స్‌ను స్థానిక గాంధీ సెంటరులో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబులెన్స్ సర్వీసును ఆర్యవైశ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యుడు ఖాలిక్, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

8 నుంచి స్వామివారి పవిత్రోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి పవిత్రోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి 11 వరకు జరుగుతాయని ఆలయ ఈవో సురేష్‌బాబు శనివారం తెలిపారు. ఎనిమిదిన విశ్వక్షేనపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, వాస్తు హోమాలు, తొమ్మిదిన పంచగవ్యప్రాశన, అగ్నిమదనం, పవిత్రశుద్ధి నవగ్రహ యజ్ఞం, ప్రధాన హోమాలు, 10న అష్టకలశారాధన, అభిషేకాలు, శ్రీవారికి పవిత్రారోహణ, వాహనోత్సవం, 11న పూర్ణాహుతి, శ్రీవారికి శాంతి కల్యాణం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని వారాహి అమ్మవారి ఆలయంలో శనివారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు తేజాశర్మ, మణికంఠ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో హరిదుర్గానాగేశ్వరరావు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి: డీపీవో



జూపూడి(ఇబ్రహీంపట్నం): గ్రామాల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారి సూచించారు. మండలంలోని జూపూడి గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. ఈసందర్భంగా చెత్త నుంచి వర్మి కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇంటింటి నుంచి తడి పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, ట్యాంకులు శుభ్రం చేయడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం నిర్వాహణపై స్థానికులు అభిప్రాయాలు తెలుసుకున్నారు. వర్షా కాలంలో తాగునీటి క్లోరినేషన్‌పై తగిన శ్రద్ధ తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్లు ఇక అంతేనా?

- పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు- నేడులో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- నిర్వహణకు అమ్మఒడి పథకం నిధులు
- కూటమి పాలనలో మూలకు చేరిన ప్లాంట్లు
- సురక్షిత తాగునీటికి దూరంగా విద్యార్థులు



కేలగ్రహారంలో ధ్వంసం అయిన తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసిన గోడలు

జగ్గయ్యపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు అభివృద్ధి పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించారు. దీనిలో భాగంగానే విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు అప్పటి ప్రభుత్వం బల్క్ ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా సురక్షిత తాగునీటిని నిరంతరం అందించేలా లక్షలు ఖర్చు చేశారు. దీంతో విద్యార్థులకు తాగునీటి ఇక్కట్లు తొలిగాయి. అయితే కూటమి ప్రభుత్వ పాలనలో పాఠశాలల్లోని ఆర్వో ప్లాంట్‌లు మూలకు చేరి అలంకారప్రాయంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయకపోవటంతో మెటీరియల్ తరగతి గదుల్లో మగ్గుతున్నాయి. దీని వల్ల పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తప్పటం లేదు.

నియోజకవర్గ వ్యాప్తంగా 134 పాఠశాలలు..

నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతో పాటు పేట పట్టణంలో జిల్లా, మండల పరిషత్ పాఠశాలలు 134 ఉన్నాయి. ఇందులో జిల్లా పరిషత్ పాఠశాలలు 29 ఉండగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు 104, వత్సవాయి మండలంలో ఒక మండల పరిషత్ పాఠశాల ఉంది.

ఇంటి నుంచే తాగునీరు..

ఈ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించారు. అప్పట్లో తాగునీటిని బయట నుంచి తీసుకు వచ్చే పని లేకుండా పాఠశాలల్లోనే అందించారు. నేడు తాగునీటికి కూడా అవస్థలు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఆర్‌వో ప్లాంట్‌లు పని చేయకపోవటంతో ఇంటి నుంచే తాగునీటిని తీసుకెళ్తున్నారు.



ముక్త్యాల జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం గదిలో ఆర్వో ప్లాంట్ సామగ్రి

ఈ పాఠశాలల్లో మరింత ఇబ్బంది

జగ్గయ్యపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రూ.ఐదు లక్షలతో నిర్మించిన ఆర్‌వో ప్లాంట్ నిరుపయోగంగా మారింది. చిల్లకల్లు, పోచంపల్లి, ముక్త్యాల జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్‌లు పని చేయటం లేదు. ముక్త్యాల పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్ సామగ్రి హెచ్ఎం గదిలోనే మగ్గుతోంది.

గతంలో అవసరమైతే మరమ్మతులు

గత ప్రభుత్వ హయాంలో ఆర్వో ప్లాంట్‌లతో పాటు విద్యార్థుల వసతులకు అన్ని వసతులు కల్పించాలని తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటున్నారు. ఆర్వో ప్లాంట్‌లు పని చేయకపోతే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించే వారు. మరుగుదొడ్లు, విద్యార్థులకు తదితర వసతులను కల్పించారు. అమ్మఒడి పథకం ద్వారా నిధులు విడుదల చేయటంతో కంపెనీ వారే మరమ్మతులు చేసేవారని, కానీ నేడు మరమ్మతులు చేసే వారు కూడా కరువయ్యారనే విమర్శలు నెలకొన్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

విద్యార్థులకు తాగునీటిని ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. కొన్ని పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్‌లు పని చేస్తున్నాయి. మరమ్మతులు గురైన ప్లాంట్‌ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – చిట్టిబాబు, ఎంఈవో– 2

తన్నీరును మర్యాదపూర్వకంగా కలిసిన ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు



పచ్చిగోళ్ల వెంకట రత్నరాజును సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల పచ్చిగోళ్ల వెంకట రత్నరాజు నూతనంగా వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అభినందించారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తన్నీరు నాగేశ్వరరావును వెంకట రత్నరాజు మర్యాదపూర్వకంగా కలవగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పేట పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు బైరబోయిన బాబు, జిల్లా బీసీ సెల్ నాయకుడు బత్తుల రాజేష్, నాయకులు బండి రంజిత్, షేక్ లతీఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

అమ్మసేవలో భక్తులు

నేడు శాకంబరీగా అమ్మవారు



కూరగాయలు, పండ్లు మాలలు కడుతున్న భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పెనుగంచిప్రోలు, పరిసరాల నుంచి వచ్చిన మహిళా భక్తులు, వివిధ సేవా సంఘాల వారు ఆలయంలో పలు రకాల కూరగాయలు, పండ్లతో మాలలు తయారు చేశారు. ఇందు కోసం వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు సమకూర్చారు. శాకంబరీ ఉత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో చండీహోమం, రాత్రికి శాకంబరీ అలంకరణలో అమ్మవారిని రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వమిస్తామని ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు తెలిపారు.

సుబాబుల్ సాగుపై రైతుల ఆసక్తి



వత్సవాయిలో కొత్తగా నాటిన సుబాబుల్ మొక్కలు

వత్సవాయి: మండలంలో సుబాబుల్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఖర్చు తక్కువ లాభం ఎక్కువగా ఉండటంతో రైతులు సుబాబుల్ సాగుకు మొగ్గుచూపుతున్నారు.

కారణం ఇదీ..

అతివృష్టి, అనావృష్టిలతో ఎప్పుడూ నష్టపోతున్న రైతుకు వ్యవసాయం చేయాలంటే పెను సవాల్‌గా మారుతోంది. అన్నింటికీ తట్టుకుని అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీరా పంట చేతికి వచ్చే సమయానికి వస్తున్న తుఫాన్లు, వైరస్‌ల ధాటికి పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా అప్పులు పాలవుతున్నారు. పంటకు ధర ఉన్న సమయాన పంట పండదు. పంట పండితే ధర లేని పరిస్థితులు తలెత్తున్నాయి.

ఒక్కసారి నాటితే మూడేళ్లు..

అందుకే కొందరు రైతులు పెట్టుబడితో పనిలేని సుబాబుల్ పంటపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కసారి నాటితే మూడు ఏళ్ల పాటు తిరిగిచూసే పనిలేదు. అతివృష్టి, అనావృష్టిలను తట్టుకుని రైతుకు నికరంగా ఆదాయం వస్తుండడమే దీనికి కారణం.

ఆశాజనకంగా ధర

ప్రస్తుతం ఎకరం సుబాబుల్ కర్ర రూ.లక్షన్నర వరకు పలుకుతోంది. మూడు ఏళ్లకు ఏకరానికి రూ.20 వేలు కూడా ఖర్చు ఉండకపోవడంతో భూములు ఎక్కువ ఉన్న రైతులతోపాటు కొద్దిపాటి భూములు ఉన్న వాళ్లు కూడా సుబాబుల్ సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు.

మండలంలో 1000 ఎకరాలకు పైగా

ఇప్పటి వరకు మండలంలో సుమారు 1000 ఎకరాలపైనే సుబాబుల్ సాగు చేపట్టినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

నందిగామ రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయటంతో పాటు జీవో నంబరు 36 ప్రకారం వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసర వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు నిరసన ప్రదర్శనలు చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 12లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే అదే రోజు అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, కండెల శ్రీను, దారెల్లి అశోక్, దాసు, వంశీ, రవి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలి



పేటలో ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు, సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వానికి, మేనేజ్‌మెంట్‌కు తెలిసే విధంగా శనివారం ఆర్టీసీ డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ ధర్నాలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు కల్యాణం కృష్ణారావు, జిల్లా నాయకులు షేక్ హిమాం, డిపో కార్యదర్శి ఎ.ఆనంద్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.సాంబశివరావు, షేక్ జిలానీ, గ్యారేజి కార్యదర్శి వి.శివగోపి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలోని ఖాళీలకు సరిపడా సిబ్బంది నియామకాలు చేపట్టాలని, తగ్గించిన షెడ్యూల్స్‌ను పెంచి, సరిపడా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయాలని, పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని, ఎన్నికల హామీ మేరకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, రిటైర్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, తదితర పలు పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

పెన్షనర్లు ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు రామ్మోహనరావు

కంచికచర్ల: ప్రతి పెన్షనర్ తమ ఆదాయం రూ.3 లక్షలు దాటితే తప్పకుండా ఇన్‌కంటాక్స్ రిటర్న్ దాఖలు చేయాలని రూ.7 లక్షల వరకు టాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదని సెక్షన్ 87ఏ ద్వారా రిబేట్ వర్తిస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు అన్నారు. కంచికచర్ల రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సానె మాట్లాడుతూ స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలతో కలుపుకుని రూ.7.75 లక్షల వరకు ఇన్‌కంటాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే ఐటీ రిటర్న్ దాఖలు చేయకపోతే ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ నుంచి నోటీసులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫారం–16, మార్చి 2024 నుంచి ఫిబ్రవర్ 2025 వరకు పెన్షన్ స్టేట్‌మెంట్‌ను కంచికచర్ల సబ్ ట్రెజరీ అధికారి నుంచి తీసుకుని ఇన్‌కంటాక్స్ రిటర్న్ వేయాలని తెలిపారు. ఏదైనా సమాచారం కావాలంటే సంఘ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

విజయవాడ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సంఘ కార్యాలయంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో నలుగురిని కాటరాక్ట్ ఆపరేషన్లకోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, ట్రెజరర్ నాగేశ్వరరావు, పెద్దినీటి కోటేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, బీవీ సర్వేశ్వరరావు, బీవీ కృష్ణమూర్తి, బీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం తాళాలు పగులగొట్టి..

నందిగామ టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో వద్ద ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఆలయం తాళాలను పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. కాగా ఆలయానికి హుండీ కూడా లేదని, అంతే కాకుండా అమ్మవారి ఆభరణాలు కూడా చోరీకి గురికాలేదని ఆలయ అర్చకుడు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ వైవీఎల్ నాయుడు శనివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



కంచికచర్లలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కంచికచర్ల: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు పేర్కొన్నారు. దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కంచికచర్లలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను యాజమాన్యానికి కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ అమలులోకి తీసుకువచ్చిందని ఆరోపించారు. లేబర్ కోడ్స్ వల్ల, వలస కార్మికులు ఇప్పటికే ఉన్న హక్కులను కోల్పోతున్నారన్నారు. ఆరోగ్య రంగానికి జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అమ్మకాన్ని ఆపాలని, ప్రజా సంపదను కాపాడాలని కోరారు. ఆశావర్కర్లకు రూ.10 లక్షల భీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాను రవి, సతీష్, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి



జుజ్జూరులో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల

వీరులపాడు: లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యతగా పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెపై శనివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు వితంతు, ఒంటరి మహిళ పింఛన్‌లను ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ధర్నా



పేటలోని విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో సెంటర్‌లో విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్య ప్రజలపై దాదాపు రూ.1500 కోట్ల విద్యుత్ భారాన్ని మోపుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అదానీతో జరిపిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకొని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కూడ విరమించుకోవాలని సూచించారు. లేదంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు నేడు ఆ హామీని తుంగలో తొక్కి ప్రజలపై పెనుభారాన్ని మోపడమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని తగ్గించకుంటే ప్రజల పక్షంగా సీపీఐ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. సీపీఐ నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, భోగ్యం నాగులు, మాశెట్టి రమేష్, కరిసె మధు, షేక్ ఖాసిం, రాణి పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని సీపీఐ నాయకుడు చుండు సుబ్బారావు పేర్కొన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను ఉప సంహరించుకోవాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలతో సామాన్యులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పెంచిన వేతనాలు ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌లకు పెంచిన వేతనం తక్షణం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.అంగన్‌వాడీలు హెల్పర్స్ మండల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ పెరిగిన ధరల రీత్యా కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.ఫేషియల్, పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారుల ఫోటోలు అప్ లోడ్ చేయడం అంగన్‌వాడీలకు ఇబ్బందిగా ఉందన్నారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.బుల్లిమ్మ, కార్యదర్శి ఎస్.నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలి



పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వీరులపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సుఖ ప్రసవాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచు కోవాలన్నారు. గర్భిణులను గుర్తించి వారు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో రాజు, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.